

స్వాహాకార్యంలో మలుపులెన్నో..

ఖమ్మం జిల్లా విద్యాశాఖలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి నిధులు స్వాహా చేయగా.. ఆయన లీలలు భద్రాద్రి జిల్లాలోనూ వెలుగుచూశాయి. 8లో



ఉద్యోగాల పేరిట టోకరా

ఉద్యోగాలు ఇప్పిస్తామని, పదోన్నతులు కల్పిస్తామని 60 మంది నుంచి ఓ ముఠా రూ.4.08కోట్లు వసూలు చేసింది. 8లో



వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి ఆలయ అర్చకులు నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

అటవీ విస్తీర్ణం పెంపునకు కృషి

డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్

ఇల్లెందురూరల్: జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంపుదలకు ప్రణాళికాయుతంగా కృషి చేస్తున్నామని డీఎఫ్‌ఓ కృష్ణాగౌడ్ అన్నారు. మండలంలోని ఒడ్డుగూడెం బీట్ పరిధిలో ఖాళీగా ఉన్న పది హెక్టార్ల విస్తీర్ణంలో మంగళవారం వనమహోత్సవంలో భాగంగా ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. అంతరించిపోతున్న అడవుల పునరుద్ధరణకు అటవీ శాఖ కృషి చేస్తోందన్నారు. పోడు సాగుదారులకు కేటాయించిన భూమి పోగా మిగిలిన అటవీ ప్రాంతాన్ని రక్షించేందుకు ట్రెంచ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఖాళీ స్థలాలను గుర్తించి పండ్ల మొక్కలు అధికంగా నాటేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2,500 ఎకరాల్లో వనమహోత్సవానికి శ్రీకారం చుట్టామని వివరించారు. నాటిన మొక్కలు చక్కగా పెరిగేలా జాగ్రత్తలు తీసుకునేందుకు వాచర్‌లను నియమిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, ఎఫ్‌ఆర్‌ఓలు ప్రసాద్, ఉదయ్, డీఆర్‌ఓ రాంసింగ్, సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగ దరఖాస్తులు తిరస్కరణ?

ఆందోళనలో 4 వేల మంది అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పలు ఉద్యోగాల భర్తీకి ఈ ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల చేయగా ఆన్‌లైన్ విధానంలో ఈనెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లో పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఎడ్‌సెల్ సంస్థకు అప్పగించారు. కాగా, సుమారు 21 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 4వేలకు పైగా దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిసింది. దరఖాస్తు నమోదు సమయంలో తమకు సమాచారం ఇవ్వకుండా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేప్పుడు చెబుతున్నారంటూ సదరు అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఈనేపథ్యాన ఎడ్‌సెల్ సంస్థ బాధ్యులతో సింగరేణి రిక్రూట్‌మెంట్ కమిటీ బుధవారం సమావేశం కానున్నట్లు తెలిసింది. దరఖాస్తులు తిరస్కరణకు గురైన తమ విషయంలో చర్చించి అవసరమైన సర్టిఫికెట్ల సమర్పణకు గడువు ఇచ్చి హాల్‌టికెట్లు జారీ చేయించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ఆగస్టులో సాగునీరు..



వీకే రామవరంలో పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, కలెక్టర్, ఎస్పీ, పీఓ, ఎమ్మెల్యే జారే..

1.50 లక్షల ఎకరాలకు సీతారామ జలాలు

- ఈ నెలాఖరు నాటికి వెట్‌రన్‌కు ఏర్పాట్లు
- రెండు పంప్‌హౌస్‌ల్లో కొనసాగుతున్న పనులు
- పరిశీలనకు రానున్న చైనా ఇంజనీర్ల బృందం
- వీకే రామవరం పంప్‌హౌస్ పరిశీలనలో మంత్రి తుమ్మల

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఈ నెలాఖరు నాటికి వీకే రామవరం, కమలాపురం పంప్‌హౌస్‌ల్లో వెట్ రన్ నిర్వహించి ఆగస్టులో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను సాగు అవసరాలకు సరఫరా చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ములకలపల్లి మండలం వీకే రామవరం – పూసుగుంట గ్రామాల మధ్యన గల రెండో పంప్‌హౌస్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టులోని రెండు, మూడు పంప్‌హౌస్‌ల్లో చైనాకు చెందిన షాంఘై ఎలక్ట్రికల్స్ కంపెనీకి చెందిన మోటార్లు ఉపయోగించినట్టు తెలిపారు. త్వరలో చేపట్టబోయే వెట్‌రన్‌కు ముందు ఈ మోటార్ల పనితీరును షాంఘై కంపెని ఇంజనీర్ల సమక్షంలో చెక్ చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. అయితే వారు ఇండియాకు వచ్చేందుకు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

వీసా సమస్య ఎదురైందని, దీన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తో సంప్రదించామని తుమ్మల వెల్లడించారు. ఈ నెలాఖరు నాటికి తనిఖీలు పూర్తిచేసి వెట్ రన్ చేస్తామన్నారు. అనంతరం ఆగస్టులో సీఎం చేతుల మీదుగా ఏన్కూరు లింక్ కెనాల్ (రాజీవ్ కెనాల్)ను ప్రారంభించి 1.50 లక్షల ఎకరాలకు గోదావరి నీళ్లు అందిస్తామని ప్రకటించారు. మంత్రి వెంట అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఇప్పటికి రూ.7,800 కోట్లు..

సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.7800 కోట్లు ఖర్చు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంప్‌హౌస్‌ల్లో మోటార్లు బిగించి మూడేళ్లు దాటితే వాటి పనితీరు దెబ్బ తింటుందని, అందుకే వెట్ రన్ నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. తొలిదశలో ఒక మోటార్ నడిపించడం ద్వారా ఎన్నెస్పీ, వైరా, లంకాసాగర్ రిజర్వాయర్లకు నీరు సరఫరా చేస్తామని అన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు శరవేగంగా సాగుతున్నాయని, వచ్చే సీజన్‌లో సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరందిస్తామనే నమ్మకం ఉందని చెప్పారు. జూలూరుపాడు, పాలేరు (బీరోలు) టన్నెళ్ల నిర్మాణం పూర్తయితే అన్ని మోటార్లు పూర్తి స్థాయిలో నడిపిస్తామని తెలిపారు. జూలూరుపాడు కాల్వ నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సీతారామ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే కొత్త, పాత కలిపి నియోజకవర్గానికి లక్ష ఎకరాల చొప్పున సాగు నీరందుతుందని వివరించారు. కృష్ణా నది నుంచి నీరు రాకపోయినా గోదావరి నీటితో సాగర్ ఆయకట్టును ఆదుకోవచ్చని, తాగు, సాగు నీటికి ఇబ్బంది ఉండదని అన్నారు. కొత్తగూడెం – తిరువూరు మార్గంలో చంద్రుగొండ వద్ద సీతారామ ప్రధాన కాల్వపై వంతెన నిర్మాణానికి జాతీయ రహదారుల సంస్థతో చర్చించగా అనుమతులు లభించాయని తెలిపారు. ప్రధాన కాల్వ నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న హెచ్‌పీసీఎల్ గ్యాస్ పైప్ లైన్ అంశంపై గుజరాత్ రాష్ట్రంతో సంప్రదింపులు పూర్తయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. సీతారామలో ఇల్లెందు ప్యాకేజీతో పాటు దుమ్ముగూడెం మండలంలో 30 వేల ఎకరాలను నీరందించేలా ప్రగళ్లపాడు లిఫ్ట్‌ల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పేర్కొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి

అన్నపురెడ్డిపల్లి : సీతారామ ప్రాజెక్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన శివారు జాతీయ రహదారిపై నిర్మిస్తున్న సీతారామ కాల్వ, బ్రిడ్జి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ నిర్మాణంతో జిల్లా సస్యశ్యామలంగా మారుతుందన్నారు. కాల్వ నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ వేగవంతం చేయాలని సూచించారు. మంత్రి వెంట కలెక్టర్ జితేష్ వి పాటిల్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీఓ రాహుల్, సీతారామ ప్రాజెక్ట్ సీఈ ఎ.శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ ఎస్. శ్రీనివాసరెడ్డి, ఈఈ అర్జున్, డీఈఈ భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

చైర్మన్, సీఈఓ నిర్ణయాలతో డీసీసీబీకి నష్టాలు

రాష్ట్ర మంత్రి తుమ్మలకు వివరించిన డైరెక్టర్లు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న డీసీసీబీ డైరెక్టర్లు

ములకలపల్లి: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని.. చైర్మన్, సీఈఓ తీసుకుంటున్న నిర్ణయాలు బ్యాంకును నష్టపర్చేలా ఉంటున్నాయని డైరెక్టర్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంగళవారం ములకలపల్లి మండలంలో పర్యటించిన రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు డైరెక్టర్లు లక్కినేని సురేందర్‌రావు, జనగం కోటేశ్వరరావు, గొర్ల సంజీవరెడ్డి, బోబోలు లక్ష్మణ్ రావు, నిర్మల పుల్లారావు, మోదుగు పుల్లారావు వినతిపత్రం అందించి మాట్లాడారు. చైర్మన్, సీఈఓ నడుమ సమన్వయ లేమితో బ్యాంకుపై రైతులు, ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోందని తెలిపారు. అంతేకాక డైరెక్టర్ల అభిప్రాయాలకు ఏ మాత్రం గౌరవం ఇవ్వడం లేదని చెప్పారు. డైరెక్టర్లతో సంప్రదించకుండా సుమారు రూ.70 లక్షలను అధికారులకు ఇన్సెంటివ్‌గా అందజేశారని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు హెచ్‌ఆర్‌సీ పాలసీని పక్కన పెట్టి ఉద్యోగులను బదిలీ చేయగా పెద్ద ఎత్తున నగదు చేతులు మారిందనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఆడిటర్లను మార్చాలని తీర్మానిస్తే అధికారులకు ఇష్టమైన వారిని నియమించుకుని, మూడు రెట్లు అధికంగా వేతనం ఇచ్చారని చెప్పారు. వానాకాలం సీజన్‌లో రూ.780 కోట్ల పంట రుణాలకు కేవలం రూ.270 కోట్లే ఇచ్చారని తెలిపారు. ఇకనైనా పూర్తిస్థాయిలో చైర్మన్, వైస్ చైర్మన్‌ను నియమించాలని, ఖాళీగా ఉన్న నాలుగు డైరెక్టర్ల పదవులను భర్తీ చేయాలని కోరారు. కాగా, బుధవారం ఖమ్మం రానున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి సైతం ఈ అంశాలను తీసుకెళ్లాలని డైరెక్టర్లు నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రభుత్వ ప్రాధాన్యతలపై దృష్టి పెట్టండి

కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. వనమహోత్సవం, ప్రజాపాలన సహాయ కేంద్రాల నిర్వహణ, మహిళా శక్తి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పనులు, వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి కోసం సంప్‌లు నిర్మించాలని, వంటగదిపై సింటెక్స్ ట్యాంక్ ఏర్పాటు చేసి విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునేలా స్టీల్ బేసిన్లు అమర్చాలని ఆదేశించారు. వృథానీటిని ఇంకుడు గుంతల ద్వారా పాదుపు చేయాలన్నారు. పాఠశాలల్లోకి దోమలు, పాములు రాకుండా కిటికీలకు మరమ్మతులు చేయించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని డీపీఓను ఆదేశించారు. ఎక్కడా నీరు నిలవకుండా చూడాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. జిల్లాలో 108 వాహనాలను సిద్ధంగా ఉంచాలని, ఏమైనా రిపేర్లు ఉంటే తక్షణమే చేయించాలని వైద్యాధికారులకు చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు అందుబాటులో లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. డీసీహెచ్ పరిధిలో అన్ని జనరేటర్లు వెంటనే మరమ్మతు చేయించాలన్నారు. వర్షాకాలంలో విద్యుత్ కోతలతో ఆస్పత్రులు అంధకారంలో ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ రాహుల్, డీఆర్‌డీఓ విద్యాచందన, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్, జిల్లా వ్యవసాయాధికారి బాబురావు, గిరిజన సంక్షేమాధికారి తానాజీ, డీడీ మణెమ్మ, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్ల బదిలీ

- కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డీఎంలకు పోస్టింగ్
- ఖమ్మం డీఎం హెడ్డాఫీస్‌కు అటాచ్



ఖమ్మంమయూరిసెంటర్: టీజీఎస్ ఆర్టీసీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతి కల్పించడంతో పాటు పలు డిపోల మేనేజర్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఖమ్మం రీజియన్‌లోని నాలుగు డిపోల మేనేజర్లను బదిలీ చేసిన యాజమాన్యం.. ఆ స్థానాల్లో పదోన్నతి కల్పించిన ఉద్యోగులను డీఎంలుగా కేటాయించింది. ఈ మేరకు ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావును హెడ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించగా.. ఆ స్థానంలో నిజామాబాద్ ఆర్‌ఎం కార్యాలయం అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) పి.దినేష్‌కుమార్‌ను పదోన్నతిపై నియమించారు. కొత్తగూడెం డిపో మేనేజర్ బీ.వీ.రావును హెడాఫీస్ ఏఎంఈ(ఎలక్ట్రికల్)గా బదిలీ చేయగా.. గద్వాల డిపో అసిస్టెంట్ మేనేజర్(ట్రాఫిక్) ఎం.దేవేందర్‌గౌడ్‌ను పదోన్నతిపై కేటాయించారు. ఇక మణుగూరు డీఎం టి.స్వామిని వరంగల్ బస్‌స్టేషన్ ఏటీఎంగా బదిలీ చేసి, హయత్‌నగర్–1 డిపో అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్యాంసుందర్‌ను పదోన్నతిపై మణుగూరు డీఎంగా నియమించారు. భద్రాచలం డిపో మేనేజర్ వి.రామారావును కరీంనగర్ జోన్ కార్గో ఏటీఎంగా బదిలీ చేసి, హెడాఫీస్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.తిరుపతిని పదోన్నతిపై భద్రాచలం డీఎంగా కేటాయించారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా హెచ్‌ఎంలు

23 మండలాల బాధ్యతలు 9 మందికి..



ఇల్లెందు: జిల్లాలోని 23 మండలాలకు 9 మంది జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగిస్తూ డీఈఓ వెంకటేశ్వరాచారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ సులభంగా ఉండేందుకు సమీప మండలాల వారినే కేటాయించామని పేర్కొన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పి.కృష్ణయ్యకు గతంలో అశ్వారావుపేట, ఆళ్లపల్లి, గుండాల మండలాలు కేటాయించగా పర్యవేక్షణ భారమైంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆయనకు ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల మండలాల బాధ్యతలు అప్పగించారు. జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురం హెచ్‌ఎం బి. జుంకీలాల్‌ను కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాల ఇన్‌చార్జ్ ఎంఈఓగా నియమించారు. పాల్వంచ మండలం జగన్నాథపురం హెచ్‌ఎం ఎ. శ్రీరామ్మూర్తికి పాల్వంచ, ములకలపల్లి మండలాలు కేటాయించారు. అశ్వాపురం మండలం మిట్టగూడెం హెచ్‌ఎం వి. వీరస్వామికి అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాలు, దుమ్ముగూడెం మండలం పర్ణశాల హెచ్‌ఎం ఎస్. సమ్మయ్యకు భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు మండలాలు, దమ్మపేట మండలం పట్వారిగూడెం హెచ్‌ఎం కె. లక్ష్మికి దమ్మపేట, అశ్వారావుపేట మండలాల బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం జిల్లా వీఎం బంజర హెచ్‌ఎం ఎస్. సత్యనారాయణను అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల ఇన్‌చార్జ్ ఎంఈఓగా నియమించారు. కామేపల్లి మండలం జి.వెంకట్‌కు జూలూరుపాడు, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు హెచ్‌ఎం టి.రాంసింగ్ కు టేకులపల్లి మండల బాధ్యతలు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఆంజనేయస్వామికి 101 బిందెలతో జలాభిషేకం

అశ్వారావుపేటరూరల్: వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని ఊట్లపల్లి సమీపంలోని వెంకమ్మ చెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామిని రైతులు వేడుకున్నారు. ఈ మేరకు స్వామివారి విగ్రహానికి మంగళవారం 101 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం వ్యవసాయ పనులు ప్రారంభించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రైతు సంఘం జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, విశ్వనాథం

సింగరేణి(కొత్తగూడెం)/దుమ్ముగూడెం/జూలూరుపాడు : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఏఐకేఎస్) జిల్లా నూతన కమిటీని మంగళవారం ప్రకటించారు. కొత్తగూడెంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండలం గంగోలులో జరిగిన సంఘం జిల్లా మహాసభలో 59 మందితో ఎన్నికైన నూతన కౌన్సిల్‌ను ఆమోదించినట్లు తెలిపారు. ఈ మేరకు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడిగా ఏపూరి బ్రహ్మం, సరెడ్డి పుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా చంద్ర నరేంద్రకుమార్, కార్యదర్శిగా ముత్యాల విశ్వనాథంను ఎనుకున్నామని వెల్లడించారు. అలాగే, ఆర్గనైజింగ్ కార్యదదర్శులుగా సలిగంటి శ్రీనివాసరావు, చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా తాళ్లూరి పాపారావు, మంగి వీరయ్య, ఆంద్రు వామనరావు, పరమ ఇమ్మానియేల్, వాడే లక్ష్మి, సాల్వ రవికుమార్, సపావట్ రవి, సహాయ కార్యదర్శులుగా చంద్రగిరి శ్రీనివాసరావు, కొమారి హన్మంతరావు, గుగులోత్ రాంచందర్, బుల్లోజు వేణు, పాండవుల బిక్షం, నరాటి రమేష్, యాస రోశయ్య, కోశాధికారిగా పద్దం విజయలక్ష్మితో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు నరేంద్ర, విశ్వనాథం మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా పాలకులపై ఒత్తిడి తెచ్చేందుకు ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కాగా, నూతన కార్యవర్గాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అభినందించారు.

ఎలా ఇద్దాం.. ఏం చేద్దాం?!

- 'రైతుభరోసా'పై అభిప్రాయ సేకరణ
- ఎన్ని ఎకరాలకు ఇవ్వాలి.. సాగు చేయకున్నా ఇవ్వాలా?
- నేడు ఖమ్మంలో ప్రజాప్రతినిధులు, రైతులతో కీలక సమావేశం
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి, ముగ్గురు మంత్రులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో భాగమైన రైతు భరోసా అమలు విషయంలో విధివిధానాల ఖరారు కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున ఇవ్వగా.. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15 వేల చొప్పున అందిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం జిల్లాలో ఎకరానికి రూ.10 వేల చొప్పున 3.42 లక్షల మంది రైతులు రూ.360 కోట్లు అందుకుంటున్నారు. అయితే పథకంలో మార్పులు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం.. ఇప్పటికే జిల్లాలో వ్యవసాయ శాఖ, సహకార సంఘాల ఆధ్వర్యాన అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చించేందుకు ఖమ్మం కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం ఏర్పాటుచేయగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు రైతు ప్రతినిధులు, సంఘాల నాయకుల అభిప్రాయాలు సేకరించనున్నారు.

ఇప్పటికే పేరు మార్పు

గత ప్రభుత్వం రైతుబంధు పేరుతో ఏటా ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసింది. వానాకాలం, యాసంగిలో రూ.5 వేల చొప్పున ఇచ్చింది. ఎన్ని ఎకరాల భూమి ఉన్నా.. సాగు చేసినా, చేయకున్నా పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు ఈ సాయం అందింది. ఈ నేపథ్యాన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పథకం పేరును రైతు భరోసాగా మార్చింది. అలాగే, పెట్టుబడి సాయంగా ఇస్తామని చెప్పిన రూ.15 వేలు రెండు విడతల్లో ఇస్తారా, ఒకే విడతలో ఇస్తారా తేలాల్సి ఉంది.

రైతు వేదికల్లో అభిప్రాయ సేకరణ

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే రైతు భరోసా అమలులో మార్పులు తీసుకొస్తామని చెబుతున్నారు. ఈనేపథ్యాన ఎన్ని ఎకరాల వరకు పెట్టుబడి సాయం ఇవ్వాలి, భూమి సాగులో ఉన్నా, లేకున్నా జమ చేయాలా, వద్దా అన్న అంశంపై ఇప్పటికే జిల్లాలో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తయింది. జిల్లాలోని 129 రైతు వేదికల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన, 76 సహకార సంఘాల ఆధ్వర్యంలో మహాజన సభలు నిర్వహించారు. ప్రధానంగా ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలి.. సేద్యం కాని భూముల పరిస్థితి ఏంటనే అంశంపై అభిప్రాయాలు కోరగా ఎక్కువ మంది పదెకరాల వరకు రైతు భరోసా వర్తింపజేయాలని సూచించారు.

నేడు కీలక సమావేశం

జిల్లాలో వ్యవసాయ శాఖ, సహకార సంఘాల ద్వారా అభిప్రాయ సేకరణ పూర్తికావడంతో.. బుధవారం కలెక్టరేట్‌లో కీలక భేటీ ఏర్పాటుచేశారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హాజరు కానున్నారు. అలాగే ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, రైతులు కలిపి 250 మంది పాల్గొననున్నారు. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే ఈ సమావేశంలో రైతుభరోసా అమలు విధివిధానాలపై అభిప్రాయాలు సేకరిస్తారు. ఆర్థిక, రెవెన్యూ, వ్యవసాయ శాఖ మంత్రులు జిల్లాకు చెందిన వారే కావడంతో ఈ సమావేశంలో ఏదైనా ప్రకటన చేస్తారా అన్న ఉత్కంఠ నెలకొంది. కాగా, ఇక్కడి అభిప్రాయాల ఆధారంగా ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించే అవకాశముందని తెలుస్తోంది.

క్లుప్తంగా

గోదావరిలో మునిగిన వ్యక్తిని కాపాడిన గజఈతగాళ్లు



గోదావరి ఒడ్డున పోకల రమేశ్

భద్రాచలంఅర్బన్: గోదావరిలో మంగళవారం ఓ వ్యక్తి స్నానం చేస్తూ మునిగిపోగా గత ఈతగాళ్లు కాపాడారు. స్థానికుల కథనం ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా సంతరావూరు గ్రామానికి చెందిన పోకల రమేశ్ శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకునేందుకు భద్రాచలం వచ్చాడు. గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోతుండగా గమనించిన గత ఈతగాళ్లు ప్రసాద్‌తో పాటు మరికొందరు రమేశ్‌ను కాపాడి ఒడ్డుకే చేర్చారు.

బాలికను గర్భవతిని చేసిన యువకుడు

చంద్రుగొండ: బాలిక (17)ను నమ్మించి గర్భవతిని చేసిన ఘటన మండలంలోని ఇమ్మడి రామయ్యబంజర్ వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. ఇమ్మడి రామయ్యబంజర్‌కు చెందిన కంపసాటి రవి అదే గ్రామానికి బాలికను మాయమాటలతో ప్రలోభపెట్టి లోబర్చుకున్నాడు. బాలిక శరీరంలో వచ్చిన మార్పును గమనించిన తల్లి.. వైద్యుల వద్ద పరీక్షలు చేయించింది. బాలిక రెండు నెలల గర్భిణిగా నిర్ధారణ కావడంతో గ్రామంలో పెద్దలు పంచాయితీ నిర్వహించారు. అక్కడ న్యాయం జరగకపోవడంతో బాధితురాలి తల్లి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మాచినేని రవి మంగళవారం తెలిపారు.

పశు వైద్యశాల ఆకస్మిక తనిఖీ



స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి పురంధర్

జూలూరుపాడు: స్థానిక పశు వైద్యశాలను మంగళవారం జిల్లా పశు వైద్యాధికారి పురంధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అజొల్లా పిట్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పశువులు ఆరోగ్యంగా ఉండాలన్నా, పాల దిగుబడి బాగా ఉండాలన్నా వాటికి అందించే మేతపై శ్రద్ధ చూపాలని సూచించారు. ఖర్చు తక్కువతో పోషక విలువలు ఉన్న అజొల్లా పచ్చి మేత సాగు చేయాలని, పశువులు అజొల్లా తినడం వల్ల పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జూలూరుపాడు పశు వైద్యాధికారి బానోత్ బద్యాలాల్, జేవీఓ పూర్ణచందర్‌రావు, ఎంపీఓ తులసీరామ్, నరసింహారావు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

దుమ్ముగూడెం: మండలంలోని బట్టిగూడెం గ్రామానికి చెందిన జలకం ముత్యాలరావు (42) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడని పోలీసులు మంగళవారం తెలిపారు. జలకం సీతారాములు, జలకం ముత్యాలరావు ఈ నెల 3వ కిరాణా సామగ్రి కోసం ద్విచక్రవాహనంపై లక్ష్మీనగరం వచ్చారు. అనంతరం వారు తిరిగి గ్రామానికి వెళ్తుండగా కాటాయిగూడెం గ్రామ శివారులో మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చి బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ముత్యాలరావు, సీతారాములును భద్రాచలం ఏరియాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ముత్యాలరావును ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. సీతారాములు భద్రాచలంలోనే చికిత్స పొందుతున్నాడు. కాగా, కిష్టారం గ్రామానికి చెందిన కణితి కృష్ణ వేగంగా వచ్చి ఢీకొట్టడంతోనే ప్రమాదం జరిగిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ రాజేందర్ తెలిపారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుడి ఆత్మహత్య



ఆరేపల్లి కార్తీక్ (ఫైల్)

ఇల్లెందు: మున్సిపల్ చెత్త సేకరణ వాహనం డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆరేపల్లి కార్తీక్ (28) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొత్తగూడెం రామవరానికి చెందిన కార్తీక్ ఇల్లెందు మున్సిపాలిటీలో హరితహారంలో వర్కర్‌గా పనిచేస్తున్న రమేశ్ వద్ద ఉంటూ తడి, పొడి చెత్త సేకరణ వాహన డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థికంగా, మానసికంగా ఇబ్బంది పడుతున్న కార్తీక్.. మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి ఉరివేసుకకున్నాడు. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇఫ్టూ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలి నివాళులర్పించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

స్వాహాకార్యంలో మలుపులెన్నో...

- విద్యాశాఖ కాంట్రాక్టు ఉద్యోగి లీలలపై విచారణ
- రూ.61లక్షలు గోల్‌మాల్ చేసినట్లు ప్రాథమిక నిర్ధారణ
- బ్యాంకు సిబ్బంది సహకారంపైనా ఆరా

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖలోని సమగ్రశిక్షా భియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగి రామకృష్ణ రూ.1.82కోట్ల మేర నిధులు స్వాహా చేసిన అంశంపై విచారణలో రోజుకో కొత్త అంశం బయటపడుతోంది. తీగ లాగితే డొంక కదిలిన చందంగా ఖమ్మం జిల్లాకే పరిమితమైన ఆయన లీలలు భద్రాద్రి జిల్లాలోనూ వెలుగుచూశాయి. స్కూల్ గ్రాంట్ నిధులు 1.82కోట్లు స్వాహా చేసినట్లు ఆరోపణలు వస్తుండగా, విద్యాశాఖ అధికారులు సోమవారం వరకు రూ.26లక్షలు మాత్రమే స్వాహా అయినట్లు వెల్లడించారు. అయితే, రామకృష్ణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని మైనార్టీ గురుకుల పాఠశాలకు సంబంధించి రూ.35లక్షలు సైతం వాడుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆయన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ కొంతకాలం విధులు నిర్వర్తించిన నేపథ్యాన రూ.61లక్షలు పోగా మిగతా నిధులు ఎక్కడివనేది తేలాల్సి ఉంది.

బ్యాంక్ సిబ్బంది సహకారం?

ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ బ్యాంకు సిబ్బంది కొందరు రామకృష్ణకు సహకరించడంతోనే అవకతవకలకు పాల్పడినట్లు విద్యాశాఖ అధికారులు నిర్ధారించారు. అకౌంట్ తెరిచింది మొదలు నగదు డ్రా చేసే వరకు బ్యాంక్ సిబ్బంది అడుగడుగునా సహకరించినట్లు తెలుస్తోంది. డీఈఓ, ఇతర అధికారుల పేరిట వారి సమాచారం లేకుండా అకౌంట్ తెరవడానికి వీలుండదు. కానీ ఫోర్జరీ సంతకాలతో అకౌంట్ తెరవడంతో పాటు చెక్కుల రూపంలో కాకుండా నేరుగా రామకృష్ణకు నగదు ఇచ్చినట్లు తేలడం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. కనీసం అకౌంట్ తెరిచే సమయాన డీఈఓకు సైతం చెప్పలేదని, నేరుగా రూ.12లక్షలు నగదు ఇచ్చినప్పుడు కూడా సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ఈవ్యవహారంపై బ్యాంక్ సిబ్బందిని సమాచారం అడిగితే చెప్పడం లేదని విద్యాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇక స్కూళ్ల బాధ్యులు తెరిచే పీపీఏ అకౌంట్ ద్వారా హెచ్‌ఎం, ఎస్‌ఎంసీ చైర్మన్ సంతకం లేకున్నా రామకృష్ణ డ్రా చేశారని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై రాష్ట్రస్థాయి సమగ్ర శిక్షాభియాన్ సీనియర్ కన్సల్టెంట్ జి.విజయశంకర్, జూనియర్ అకౌంట్ ఆఫీసర్ వి.బాలజయశంకర్ తదితరులు మంగళవారం రఘునాథపాలెం మండలం బూడిదంపాడు స్కూల్, కారేపల్లి మోడల్ స్కూల్, కెనరా బ్యాంకుతో పాటు డీఈఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ విషయమై డీఈఓ సోమశేఖరశర్మ మాట్లాడుతూ సమగ్ర శిక్షాభియాన్ ఉద్యోగి రామకృష్ణ నిధులు స్వాహా చేసిన అంశంపై కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ దృష్టికి తీసుకెళ్లామని, ఈ వ్యవహారంలో సహకరించిన వారిపైనా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగాలు, పదోన్నతుల పేరిట టోకరా

- 60 మంది నుంచి రూ.4.08కోట్లు వసూళ్లు
- ఆపై ఆభరణాలు కొని బ్యాంకులో తాకట్టు
- ముఠా వివరాలు వెల్లడించిన భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

కొత్తగూడెంటౌన్: అమాయక యువత, ఉద్యోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని ఘరానా మోసానికి పాల్పడిన ముఠా ఉదంతమిది. ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తామని నమ్మబలికి 60 మంది నుంచి రూ.4.08కోట్లు వసూలు చేసిన ఓ మహిళ సహా 13 మందితో కూడిన ముఠాకు చెక్ పెట్టారు. 2018 నుంచి ఈ దందా కొనసాగుతుండగా చుంచుపల్లి పోలీసుస్టేషన్‌లో గత ఏడాది బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుల్లో తొమ్మిది మందిని ఇప్పటికే అరెస్ట్ చేయగా దాసు హారికను మంగళవారం అరెస్ట్ చేసిన నేపథ్యాన ఎస్పీ రోహిత్‌రాజ్ వివరాలు వెల్లడించారు.

2018 నుంచి మోసాలు..

సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలే కాక గ్రూప్–2 ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఇప్పటికే ఉద్యోగాలు చేస్తున్న వారికి పదోన్నతులు కల్పిస్తామని ముఠాగా ఏర్పడిన 13 మంది నమ్మించారు. ఇలా భద్రాద్రి జిల్లాలో 32మందితో పాటు ఇతర జిల్లాలకు చెందిన వారితో కలిసి 60 మంది నుంచి రూ.4.08కోట్ల మేర వసూలు చేశారు. ఏళ్ల గడుస్తున్నా ఉద్యోగాలు రాక, పదోన్నతులు లభించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన జిల్లా బాధితులు గత సంవత్సరం చుంచుపల్లి పోలీసులను ఆశ్రయించారు. దీంతో తొమ్మిది మందిని ఇప్పటికే అరెస్ట్ చేయగా ముఠాలోని మహిళ హారికను మంగళవారం అరెస్ట్ చేశారు. కాగా, నిందితుల నుంచి ఇప్పటివరకు రూ.1.47 కోట్ల నగదు, నాలుగు తులాల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. ఇక బాధితుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో నిందితులు 92.5 తులాల బంగారు ఆభరణాలు కొని బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నట్లు గుర్తించామని చెప్పారు. ఆ ఆభరణాలను కూడా చట్టప్రకారం స్వాధీనం చేసుకుంటామని ఎస్పీ తెలిపారు. అంతేకాక పరారీలో ఉన్న ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు, రేపు సింగరేణిలో మెడికల్ బోర్డ్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో బుధ, గురువారం కార్పొరేట్ మెడికల్ బోర్డ్ నిర్వహించనున్నారు. సంస్థలో విధులు నిర్వర్తిస్తూ రెండేళ్ల సర్వీస్ ఉన్న వారి స్థానంలో వారసులకు ఉద్యోగావకాశం కల్పించేందుకుగాను యాజమాన్యం మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేసింది. తొలిరోజైన మంగళవారం కార్మికుడి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరీక్షిస్తారు. ఇందులో వచ్చే నివేదిక ఆధారంగా బుధవారం వైద్యనిపుణుల ద్వారా మెడికల్ ఇన్‌వాలిడేషన్‌కు అర్హుడా, కాదా అన్నది వెల్లడిస్తారు. ఒకవేళ ఇన్‌వాలిడేషన్ అయితే వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం ఉంటుంది. మిగతా వారు యథావిధిగా విధులకు హాజరుకావాల్సి ఉంటుంది.

పారదర్శకతపై నీలినీడలు

సింగరేణిలో మెడికల్ బోర్డ్ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. కానీ, మెడికల్ బోర్డ్‌కు దరఖాస్తు చేసుకున్న కార్మికుల జాబితా ఆధారంగా పలువురికి దళారులు ఫోన్ చేసి అన్‌ఫిట్ చేయిస్తామని చెబుతుండడం గమనార్హం. ఈ నేపథ్యాన ఇలాంటి వారి వివరాలను 94911 44104 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నా పెద్దగా స్పందన ఉండటం లేదని సమాచారం. గతనెలలో ఏసీబీ, సీఐడీ అధికారులు సైతం ఈ విషయంలో దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తుండగా ఎవరిపై చర్యలైతే తీసుకోలేదు. దీంతో ఈసారైనా నిఘా మరింత పెంచాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై సింగరేణి సీఎండీ బలరామ్ మాట్లాడుతూ.. మెడికల్ బోర్డ్ విషయంలో అన్‌ఫిట్ అయిన వారి జాబితాను పరిశీలిస్తామని, ఎవరి విషయంలోనైనా దళారుల ప్రమేయం ఉందని తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాక నిఘాను మరింత పటిష్టం చేసే క్రమంలో విజిలెన్స్, ఇంటెలిజెన్స్ ఉద్యోగులకు సూచనలు జారీ చేశామని తెలిపారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగులు

వేంసూరు: విద్యుత్ వినియోగదారులు పంపిణీ, ఇతర అంశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) లక్ష్యమని చైర్మన్ వేణుగోపాలాచారి తెలిపారు. వేంసూరు మండలం రాయుడుపాలెం సబ్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. విద్యుత్ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశాక పరిష్కారం కాకపోతే రాతపూర్వకంగా కానీ, ఆన్‌లైన్‌లో కానీ సీజీఆర్‌ఎఫ్ దృష్టికి తీసుకురావొచ్చని తెలిపారు. అనంతరం సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, సభ్యులను ఉద్యోగులు సన్మానించారు. సీజీఆర్‌ఎఫ్ సభ్యులు కె.రమేశ్, ఆర్.చరణ్‌దాసు, ఎస్.నరేందర్, సత్తుపల్లి డీఈ రాములు, ఉద్యోగులు శ్రీధర్, యాదగిరి, జొన్నలగడ్డ అనిల్‌కుమార్, అంకురావు, శరత్ పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాలకు చెక్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సనత్‌కుమార్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ పరిధిలోని పనిస్థలాల్లో భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకుంటూనే సిబ్బందికి సంక్షేమం, ఆరోగ్య పరమైన చర్యలపై అవగాహన కల్పిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని సౌత్ సెంట్రల్ జోన్ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డీడీఎంఎస్) సనత్‌కుమార్ తెలిపారు. కొత్తగూడెంలో మంగళవారం అధికారులు, ఉద్యోగులు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులకు మంగళవారం ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలు సాధిస్తూనే పనిప్రదేశాల్లో భద్రతా సూత్రాలు పాటించాలని తెలిపారు. అందరికీ భద్రతపై అవగాహన ఉంటే వారిని రక్షించుకోవడమేకాక తోటి వారిని రక్షించడం సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్ మాట్లాడగా, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, అధికారులు కృష్ణగోపాల్ తివారీ, శాలేంరాజు, జాన్ ఆనంద్, దామోదర్‌రావు, గోపాలరాజుతో పాటు నాయకులు రమణమూర్తి, సి.త్యాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబావుల వేలాన్ని వ్యతిరేకిస్తాం

- సింగరేణి పరిరక్షణ ఏఐటీయూసీతోనే సాధ్యం
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థను, కార్మికులను రెండు కళ్లలా సంరక్షించడం ఏఐటీయూసీతోనే సాధ్యమని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బొగ్గు బావుల వేలాన్ని వ్యతిరేకిస్తూ సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సింగరేణి మనుగడకు ప్రమాదం వాటిల్లేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. బొగ్గు బావుల వేలాన్ని వ్యతిరేకిస్తామని, సంస్థ పరిరక్షణకు ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కార్మికుల కష్టాలు తెలుసుకుని, వారి వెన్నంటి ఉండేవారిని విస్మరించి ఎన్నికలకు రెండు రోజుల ముందు చొక్కాలను మార్చిన వాళ్లను గెలిపిస్తే పరిస్థితులు ఇలాగే ఉంటాయని ఐఎన్‌టీయూసీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కార్మికుల కష్టనష్టాల్లో తోడుంటూ ముందుకు నడిపిస్తున్న ఏఐటీయూసీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వంగా వెంకట్, శేషయ్య, వీరస్వామి, సందెబోయిన శ్రీనివాస్, కత్తెర రాములు తదితరులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ప్రభుత్వ విప్



ఆలయంలో విప్ శ్రీనివాస్, తదితరులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామిని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తులతో పాటు లక్ష్మీతాయారు అమ్మవారిని దర్శించుకున్నాక పండితులు వేదాశీర్వచనం, ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోడు రైతు ఆత్మహత్యాయత్నం

భూమి ఆక్రమించారని కానిస్టేబుల్ కుటుంబంపై ఆరోపణలు

రఘునాథపాలెం: ఏళ్లుగా పోడు సాగుచేసుకుంటుండగా.. అటవీశాఖ, పోలీసు అధికారులు తప్పుడు కేసులు బనాయిస్తున్నారని చెబుతూ ఓ రైతు సోమవారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రఘునాథపాలెం మండలం రజబ్ అలీనగర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రజబ్ అలీనగర్‌కు చెందిన బోడా ప్రసాద్ – లలిత దంపతులు గ్రామ పరిధిలోని ఏడెకరాలను పదిహేనేళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఖమ్మంకు చెందిన కానిస్టేబుల్ లక్ష్మణ్ ఆర్‌ఓఎస్‌ఆర్ పట్టా పాసు పుస్తకం తెచ్చుకుని భూమి తనదేనని చెబుతున్నట్లు ప్రసాద్ కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రసాద్ రఘునాథపాలెం పోలీసులను ఆశ్రయించగా, సీఐ శ్రీహరి ఫారెస్ట్, రెవెన్యూ అధికారులను నివేదిక కోరారు. ఈమేరకు ఫారెస్ట్ అధికారులు రికార్డుల ఆదారంగా కానిస్టేబుల్ కుటుంబానికే పట్టా ఉందని చెప్పినట్లు తెలిసింది. ఈక్రమంలో తరచూ తనను పోలీసుస్టేషన్‌కు పిలిచి ఇబ్బంది పెడుతున్నారని, కానిస్టేబుల్ లక్ష్మణ్ కొందరిని పంపించి పత్తి పంటను నాశనం చేశారని చెబుతూ సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడని ఆయన భార్య లలిత వెల్లడించారు. ఈ అంశంపై సీఐ శ్రీహరిని వివరణ కోరగా భూమికి సంబంధించి అటవీశాఖ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారమే నడుచుకున్నామని చెప్పగా.. ఎఫ్‌ఆర్వో రాధిక మాట్లాడుతూ గతంలో ఎఫ్‌ఆర్సీ కమిటీ తీర్మానం ఆధారంగా కానిస్టేబుల్ లక్ష్మణ్ భార్య లావణ్యకు పాస్‌పుస్తకం ఇప్పించినట్లు తెలిపారు. కాగా, ప్రసాద్ ఆత్మహత్యాయత్నానికి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆయన భార్య మంగళవారం ఖమ్మం సీపీ సునీల్‌దత్‌కు ఫిర్యాదు చేసింది.

ఎలాంటి సంబంధం లేదు...

ఖమ్మం మామిళ్లగూడెం: రైతు బోడ ప్రసాద్ ఆత్మహత్యాయత్నం విషయంలో తమకెలాంటి సంబంధం లేదని కానిస్టేబుల్ లక్ష్మణ్ భార్య లావణ్య తల్లి లీలాబాయి వెల్లడించారు. ఖమ్మంలో ఆమె మాట్లాడుతూ లావణ్య ఈ ఏడాది భూమిని ప్రసాద్‌కు కౌలు ఇవ్వకపోవడంతోనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని, ఆయన నుంచి తమకు ప్రాణహానీ ఉన్నందున అధికారులు స్పందించాలని కోరారు.

ట్రేడింగ్‌లో రూ.2 లక్షల నగదు స్వాహా

పాల్వంచ: ట్రేడ్ మార్కెట్‌లో నగదు పెడితే అధిక లాభం వస్తుందని నమ్మించి సైబర్ నేరగాళ్లు నగదు స్వాహాకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన యాక్సిస్ బ్యాంక్ మేనేజర్ నందికోల వెంకటేశ్ సెల్‌ఫోన్‌కు గత మే నెల 3వ తేదీన లింక్ వచ్చింది. ట్రేడ్ మార్కెట్‌లో రూ.50 వేలు నగదు పెడితే లాభం వస్తుందని చూపించారు. దీంతో అతను అమౌంట్ ట్రాన్స్‌ఫర్ చేశాడు. కొంత అమౌంట్ విత్‌డ్రా చూపించారు. మరోసారి రూ.2 లక్షలు పంపిస్తే రూ.15 లక్షలు విత్‌డ్రా చేసుకోవచ్చని మెసేజ్ వచ్చింది. దీంతో అతను మళ్లీ రూ.2 లక్షలు నగదును ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం ఎలాంటి మెసేజ్ రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్‌లో రూ.50 వేలు..

ఆన్‌లైన్‌లో లింక్ రావడంతో దానిని ఓపెన్ చేయగానే నగదు మాయమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కేటీపీఎస్ ఏ–కాలనీలో ఉంటున్న కేటీపీఎస్ 5, 6 దశల సబ్ ఇంజనీర్ నలబాల భరత్‌కు గత మార్చి 12వ తేదీన సెల్‌ఫోన్‌కు మెసేజ్‌తో కూడిన లింక్ వచ్చింది. దానిని ఓపెన్ చేయగా అతని ఖాతా నుంచి రూ.50 వేల నగదు వేరే ఖాతాకు బదిలీ అయినట్లు సమాచారం వచ్చింది. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న సీఐ

కొత్తగూడెంటౌన్: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ మంగళవారం తిరిగి అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. కొత్తగూడెం బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్లలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్నామని అశోక్, రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారని, సీఈఐఆర్ పద్ధతిలో సెల్‌ఫోన్‌లను గుర్తించామని తెలిపారు. రికవరీ చేసి బాధితులకు అందించామని వివరించారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ సురేశ్ ఉన్నారు.

బస్సులో మర్చిపోయిన బ్యాగ్ అప్పగింత

భద్రాచలంటౌన్: భద్రాచలం డిపోకు చెందిన బస్సులో ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును ఆర్టీసీ అధికారులు మంగళవారం రాత్రి అప్పగించారు. ఖమ్మం నుంచి భద్రాచలం వస్తున్న భద్రాచలం డిపోకు చెందిన బస్సులో ఓ ప్రయాణికురాలు ఎక్కి కొత్తగూడెంలో దిగింది. ఈ క్రమంలో తన ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను మరిచిపోయింది. వెంటనే భద్రాచలం డీఎం రామారావుకు సమాచారం అందించగా ఆయన స్పందించి బస్సు కండక్టర్‌కు విషయం తెలపగా ల్యాప్‌టాప్‌ను డిపోలో అందజేశారు. దానిని ప్రయాణికురాలికి అందించడంతో ఆమె సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన నరసింహారావు

జూలూరుపాడు: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక సబ్ మార్కెట్ యార్డు సమీపంలో వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఏటా నరసింహారావు రోడ్డు పక్కకు ద్విచక్రవాహనాన్ని నిలిపి రోడ్డు దాటుతుండగా ఖమ్మం నుంచి కొత్తగూడెం వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహారావు కాలు విరగడంతో జూలూరుపాడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పెదవాగు ప్రాజెక్టుకు వరద పోటు



పెదవాగులోకి చేరిన వరదనీరు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్టులోకి వరదనీరు పోటెత్తుతోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షంతో ప్రాజెక్టు ఎగువ భాగంలోని వాగుల నుంచి వరద నీరు చేరుతోంది. పెదవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 19.3 అడుగులకు గాను ప్రస్తుతం 11 అడుగులకు చేరింది. దీనిపై ప్రాజెక్టు ఏఈఈ కృష్ణ మాట్లాడుతూ.. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులోకి వరద భారీగా వస్తోందని, నీటి మట్టం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు.

విద్యుదాఘాతానికి గురైన బాలుడు

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామంలో ఆరేళ్ల బాలుడు విద్యుదాఘాతానికి గురైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గుండెపుడి గ్రామానికి చెందిన భూక్యా వెంకటేశ్ – సరోజని దంపతుల కుమారుడు సాత్విక్ ఆడుకుంటూ.. నీళ్లు వేడి చేసే హీటర్‌ను తాకాడు. విద్యుదాఘాతంతో తీవ్ర అస్వస్థతకు గురవగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి 108 ద్వారా కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి బాలుడిని ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఇల్లెందురూరల్: మండలంలోని పోలారం గ్రామ పంచాయతీ బొంబాయితండాకు చెందిన గుగులోత్ గణేశ్ రెండు రోజులుగా కనిపించడం లేదని ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం కొమరారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి వస్తానని ఇంటి వద్ద చెప్పి బైక్‌పై వెళ్లిన గణేశ్.. ఇంటికి చేరుకోకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.